COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం : తేది : 03 జూలై, 2023

మిత్రమా!

పోలవరం నిర్వాసితుల పాదయాత్ర ప్రారంభం నుండి ముగింపు వరకు వివరాలు క్లుప్తంగా ఇస్తున్నాము. ప్రచురించగోరుతున్నాము. - జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

# పోలవరం నిర్వాసితుల పోరుకేక

## వెల్లివిరుస్తున్న సంఘీభావం

## 2023 జులై 4న విజయవాడలో మహా ధర్నా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతున్న పోలవరం నిర్వాసితుల పోరు కేక గత 14 రోజులుగా విజయవంతంగా సాగుతోంది. సిపిఐ(ఎం) సారథ్యంలో ఎర్ర జెండా నీడలో ఎండనక, వాననక, పగలనక రేయనక అడవి బిడ్డలు ఏక రీతిన జూన్ 20న నెల్లిపాక (బద్రాచలం)లో ప్రారంభమయి సాగిస్తున్న ఈ మహా పాద యాత్రకు అపూర్వ రీతిలో సంఘీభావం వెల్లివిరుస్తున్నది. గోదావరి తీరంలో కొండలు, కోనలు, గిరిజన గూడేల గుండా నిర్వాసితులు తమ హక్కుల కోసం కదం తొక్కుతూ, పదం పాడుతూ, డప్పులతో ఉద్యమ గీతాలు, రేలా నృత్యాల మధ్య దండులా కదులుతున్నారు. నాలుగు జిల్లాలు 15 మండలాలు 235 గ్రామాల మీదుగా గోదావరి, శబరి నదులను దాటుతూ ఈ రోజు 380 కిలోమీటర్లు చేరుకుంది. యాత్రలో 12 సంవత్సరాల బాలిక, బాలురతో పాటుగా 70 సంవత్సరాల వృద్ధుల వరకు పాదయాత్రలో నడిచారు. దారి పొడవునా ఈ మహా పాద యాత్రకు స్థానికులు నీరాజనాలు పలుకుతున్నారు. అమరులైన పోరాట యోధుల స్థూపాల వద్ద నివాళులర్పిస్తూ, ప్రధాన కూడళ్లలో సభలు నిర్వహిస్తూ, నిర్వాసితులను చైతన్యపరుస్తూ ప్రవాహంలా సాగిపోతున్న ఈ పాదయాత్రలో గిరిజన యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రతి గ్రామంలో పేదలే ఇంటింటికి బియ్యం, పప్పుదినుసులు సేకరించి పాదయాత్రలో పాల్గొన్నవారికి భోజనం పెట్టారు. రాత్రి, మధ్యాహ్నం బసలో వెంట తెచ్చుకున్న చాపలపై చెల్లనీడ క్రింద విశ్రమించారు. 48 డిగ్రీల ఎండలో బొబ్బలెక్కినా వెనకడుగు వేయలేదు. సామాజికమాధ్యమాల్లో చూసి అనేకమంది దాతలు చెప్పులు, బెడ్‌షీట్లు ఇచ్చారు. డాక్టర్లు వైద్యం చేశారు. మీకు తోడుగా మేమున్నాం అంటూ సిపిఐ, తెలుగుదేశం, వైసిపి, జనసేన తదితర రాజకీయ పార్టీలు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయకార్మికులు, కార్మికులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నేతలు, ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీలు, చలసాని శ్రీనివాస్, నేతి మహేశ్వరరావు వంటి మేధావులు, ఇతర సంస్థలు, వ్యక్తులు మహాపాద యాత్రలో పాల్గొని కొంత దూరం నడచి తమ సంఘీభావాన్ని తెలియజేస్తున్నారు. ప్రతిరోజూ పాదయాత్రలో సుమారు 350 మంది పాల్గొంటున్నారు. పాదయాత్ర వెళ్ళిన ప్రతి గ్రామం నుండి సంఘీభావంగా మరో సుమారు 400 మంది పాల్గొని కొంతదూరం నడుస్తున్నారు. పోలవరం నుండి మరో ఉప పాదయాత్ర జూన్ 28న ప్రారంభమయి తరువాత ప్రధాన యాత్రలో భాగస్వామి అయ్యింది.

పాదయాత్ర సందర్భంగా ప్రతి ఒక్కరినీ కలుస్తూ, వారి గోడును ఆలకిస్తూ, వారు ఇచ్చిన అర్జీలను స్వీకరిస్తూ, వారిని పోరాటోన్ముఖులను చేయడంలో పాదయాత్ర సారథులు, నాయకులు చాలా ఓర్పుగా, నేర్పుగా వ్యవహరిస్తున్నారు. పోవలరం కాఫర్ డ్యామ్ పుణ్యమా అని గత ఏడాది గోదారి వరద పోటెత్తినప్పుడు ముంపు గ్రామాల ప్రజలు పడిన అవస్థలు వర్ణనాతీతం. ఒక వైపు ఎడతెరపి లేకుండా భోరున కురుస్తున్న వర్షంలో ప్రాణాలు అరచేత పెట్టుకుని పిల్లా పాపలతో కొండలు,. గుట్టలపైన దాదాపు నెల రోజుల పాటు బిక్కుబిక్కుమంటూ గిరిజన కుటుంబాలు బతుకువెళ్లదీశాయి. కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న ఆదివాసీలకు ఆపన్న హస్తం అందించి, వారికి ఆనాడు బాసటగా నిలిచింది భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు). ఇప్పుడు మరోసారి అటువంటి ఉపద్రవం ముంచుకొచ్చే ప్రమాదమున్నందున ముందుగానే హెచ్చరిస్తూ, పోలవరం ముంపుగ్రామాల ప్రజల పునరావాసానికి ప్రప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఐ(యం) పార్టీ ఉద్యమిస్తున్నది. ప్రభుత్వం చేస్తున్న వాదనలు, వాస్తవ పరిస్థితికి మధ్య ఉన్న తేడాను వివరిస్తూ సిపిఐ(ఎం) తీసుకొచ్చిన బుక్‌లెట్‌కు విశేష స్పందన లభించింది.

రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల పరిధిలో 8 మండలాల్లో (దేవీపట్నం, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక, పోలవరం, కుక్కనూరు, వేలేరుపాడు) 222 పంచాయతీలు 373 గ్రామాలు, 1,06,006 కుటుంబాలు మొత్తం నీట మునిగిపోతాయి. ఇంత భారీ ఎత్తున గిరిజనులు, గిరజనేతరులు లక్షల కుటుంబాలు సర్వనాశనమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చేయకపోవడం అత్యంత దుర్మార్గం. గిరిజన గూడేలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. రైతులకు విత్తనాలు ఆపేశారు. పంట కొనుగోలు చేయం లేదు. అదేమంటే మీది ముంపు గ్రామం అని అధికారులు చెబుతున్నారు. ముంపు బాధితులం మాకు పరిహారం చెల్లించండి అని అదే గ్రామ ప్రజలు అడిగితే మీది 41.5 మీ. కాంటూరు పరిధిలో లేదు. కాబట్టి మీది ముంపుగ్రామం కాదు, అందువల్ల మీకు పరిహారం రాదని మళ్లీ ఇదే అధికారులు చెబుతున్నారు. 41.5 మీటర్ల దగ్గర 20 గ్రామాలు మాత్రమే మునిగిపోతాయని నిర్ధారించారు. 20 వేల మందిని నిర్వాసితులుగా తేల్చారు. నిజానికిది కాకిలెక్క. గత వరదల్లో 40 మీటర్లకు కూడా చేరకముందే 193 గ్రామాలు మునిగిపోయాయి. ఇంతకీ ప్రభుత్వ లెక్కల్లో మాది ముంపు గ్రామమా, కాదా తేల్చి చెప్పండని బాధితులు అడుగుతున్నారు. ప్రాజెక్టు ప్రదేశంలోని గ్రామాలను వరద వస్తుందనే పేరుతో బలవంతంగా ఖాళీ చేయించారు. నిర్వాసిత గ్రామాలలో కనీస సౌకర్యాలైన విద్యుత్, నీరు, ఉపాధి, స్మశానం, వైద్యం అందుబాటులో లేవు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం లేదు.

పోలవరం నిర్వాసితులు కోరుతున్న వాటిలో గొంతెమ్మ కోర్కెలు ఒక్కటంటే ఒక్కటీ లేదు. 2013 భూసేకరణ చట్టం, పెసా, 1/70 యాక్ట్, రాజ్యాంగంలోని అయిదో షెడ్యూల్ కింద ఆదివాసీలకు కల్పించిన రక్షణలను అమలు చేయమని మాత్రమే వారు కోరుతున్నారు. ఎన్నికల ముందు పాలక పార్టీ ఇచ్చిన హామీలపై మడమ తిప్పకుండా, మాట తప్పకుండా అమలు చేయమని మాత్రమే కోరుతున్నారు. ఇందుకోసం మహా పాదయాత్రకు పతాక సన్నివేశంగా జులై 4న విజయవాడలో మహా ధర్నాకు వారు కదలి వస్తున్నారు. ఈ మహాధర్నాలో సిపిఐ(యం) పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, పాదయాత్రకు నాయకత్వం వహించిన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరమ్ అధ్యక్షులు నేతి మహేశ్వరరావు మరియు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొంటారు.

= = = =